టీకాతో ప్రాణాలకు రక్షణ

- రేపు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
- పెంపుడు జంతువులకు ఉచిత టీకాలు
- డివిజన్ వ్యాప్తంగా 11500 డోసులు సిద్ధం
- అన్ని పశువైద్యశాలల్లో టీకాలు వేయడానికి ఏర్పాట్లు

లేపాక్షి: టీకాలతో ప్రాణాలను రక్షించుకోవచ్చు. ప్రధానంగా పశుపక్ష్యాదుల నుంచి సంక్రమించే వ్యాధులకు టీకాల ద్వారా పూర్తిగా రక్షణ పొందే అవకాశం ఉంది. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం హిందూపురం డివిజన్ వ్యాప్తంగా పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలు వేయనున్నారు. డివిజన్ వ్యాప్తంగా 11500 డోసులు యాంటీ రేబీస్ టీకాలను పశుసంవర్ధక శాఖ సిద్ధం చేసింది. అన్ని పశు వైద్యశాలలు, ప్రాంతీయ పశు వైద్యశాలలు, వెటర్నరీ పాలీ క్లినిక్స్‌లలో ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశారు. జూనోటిక్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయడమే జూనోసిస్ డే ప్రధాన ఉద్దేశం.

టీకాలతో వ్యాధుల నివారణ

మనుషుల నుంచి పశువులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల ఆధారంగా ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్‌పాశ్చర్ కుక్కకాటు బారిన పడిన ఒక పిల్లవాడికి టీకా మందు ఇచ్చి బతికించిన జూలై 6న ప్రపంచ వ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. సుమారు 180 రకాలకు పైబడిన వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయి. పశుపక్ష్యాదులతో మెలిగే పశువైద్యులు, రైతులు, వధశాల కార్మికులకు, పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారికి ఎక్కువగా ఈ వ్యాధులు సంక్రమిస్తాయి. ప్రధానంగా వీరికి రేబీస్, అంత్రాక్స్, బ్రూసుల్లోసిస్, క్షయ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇందులో రేబిస్ ప్రాణాంతకమైన వ్యాధి.



లేపాక్షి పశు వైద్యశాలలో శునకానికి యాంటీ రేబీస్ టీకా వేస్తున్న డాక్టర్ కిషోర్, సిబ్బంది

జూనోటిక్ వ్యాధులపై అవగాహన



ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు ఈ వ్యాధులపై అవగాహన పెంచుకుని తగిన నివారణ చర్యలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. అన్ని పశువైద్య కేంద్రాల్లో టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేశాం.

–డాక్టర్ పెంచలయ్య, పశుసంవర్ధక శాఖ డీడీ

క్లుప్తంగా

సాయి భక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

మడకశిర: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అన్నదానం కోసం సాయి భక్తులు గ్రామాలకు వెళ్లి భిక్షాటన చేస్తున్నారు. గత 10 రోజుల నుంచి వివిధ గ్రామాల్లో భిక్షాటన కొనసాగిస్తున్నారు. కార్యక్రమానికి ప్రజలను మంచి స్పందన లభిస్తోంది. ప్రజలు వస్తు, ధన రూపంలో సాయం అందిస్తున్నారు.ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతోంది. కార్యక్రమాన్ని మరికొన్ని రోజుల పాటు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ చోరీ

మడకశిరరూరల్: అయ్యవారిపల్లికి చెందిన రైతు నరసింహమూర్తి వ్యవసాయ బోరుకు అమర్చిన కేబుల్‌ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకెళ్లారు. రూ.10 వేల విలువైన కేబుల్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు రైతు నరసింహమూర్తి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా సింగేపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహారెడ్డి వ్యవసాయ బోరు కేబుల్‌ను దొంగలించుకెళ్లారు.

బూదిబెట్ట అధ్యక్షురాలిగా కల్పన



నూతన అధ్యక్షురాలిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకా లోని బూదిబెట్ట గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా కల్పన విరుపాక్షప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికలో కల్పన ఒక్కరే నామినేషన్ పత్రం దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ డీఎన్ వరదరాజు ప్రకటించారు. గ్రామ పంచాయతీలో 9 మంది సభ్యులుండగా ఒక్కరు గైర్హాజరు కావడంతో హాజరైన 8 మంది సభ్యులు కల్పన అభ్యర్థిత్వానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా గ్రాపం ఉపాధ్యక్షుడు సజ్జీరప్ప, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర రెడ్డి, హరిశేఖరరెడ్డి, ఆనందప్ప తదితరులు ఆమెను అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

లేపాక్షి: మండలంలోని తిలక్‌నగర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. నిందితుల నుంచి రూ.200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ నాయకులపై ఫిర్యాదు



టీడీపీ నేతలపై పోలీస్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

రొద్దం: కంచిసముద్రం గ్రామంలో టీడీపీ నాయకులు రామాంజేయులు, నరేష్ తమపై దాడులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మద్దతుదారు దళితవాడకు చెందిన సువర్ణ గురువారం పెనుకొండ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ అయినప్పటి నుంచి తమతో ఘర్షణలకు దిగుతూ తన భర్త నరసింహులుపై దాడి చేసి, బెదిరిస్తున్నారన్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామాంజి అనే వ్యక్తి నరేష్ అనే వ్యక్తికి మద్యం తాపి తమపై దాడులు చేయిస్తున్నాడన్నారు. తమ ఇంటి వద్దకు వచ్చి అసభ్యకర పదజాలంలో దూషిస్తున్నారని వాపోయారు. తాము వ్యవసయ పనులు చేసుకోవడానికి పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నట్లు వివరించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి



సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గోరంట్ల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని వైద్య సిబ్బంది సూచించారు. స్థానిక రాజీవ్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అతిసార లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉపాధ్యాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్ ప్రశాంతంగా ముగిసింది. నీట్ పరీక్ష పేపర్ లీకేజీని నిరసిస్తూ ఐక్య విద్యార్థి, యువజన సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈనేపథ్యంలో విద్యా సంస్థలన్నీ పూర్తి స్థాయిలో బంద్ అయ్యాయి. ఈసందర్భంగా ఐక్య విద్యార్థి,యువజన సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలే నీట్ పరీక్ష నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ తదితర విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



బంద్ నేపథ్యంలో ఇంటికి వెళ్తున్న అమరాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు

అమరాపురం: ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌యూఐ తదితర విద్యార్థి సంఘాలు గురువారం తలపెట్టిన విద్యా సంస్థల బంద్ మండలంలో విజయవంతమైంది. ఉదయం పాఠశాలలు ప్రారంభమైన తర్వాత ఏఐఎస్ఎఫ్ నాయకులు వెళ్లి హెచ్ఎంలతో మాట్లాడి పాఠశాలలను బంద్ చేయించారు.

క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్

గుడిబండ: క్షయవ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరు బీసీజీ టీకాను తప్పని సరిగా వేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీహెచ్ఎన్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్యంలో టీకాలు వేయడం వల్ల ఎలాంటి వ్యాదుల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందన్నారు. గడిచిన ఐదేళ్లుగా క్షయ వ్యాధికి మందులు వాడిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 3,015 మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, నాయకులు రమేష్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగళి: టీబీ(క్షయ) నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టినట్లు డాక్టర్ శివానంద, గాయత్రి తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా 288 మందికి బీసీజీ వ్యాక్సినేషన్ వేసినట్లు తెలిపారు.18 ఏళ్లు దాటిన, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ వాధి తగ్గిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, 60 ఏళ్లు పైబడిన వారికి ఈ టీకాను వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఫలారం గ్రామంలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రొళ్ల: మండలంలోని 60 ఏళ్లు పైబడిన వృద్ధులు క్షయ నివారణకు బీసీజీ వ్యాక్సినేషన్ తప్పని సరిగా వేయించుకోవాలని పీహెచ్ఎన్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.

సంగీత మహోత్సవం జయప్రదం చేయండి

హిందూపురం: సద్గురు యోగి నారాయణ కైవారం తాతయ్య మఠంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న గురుపూజ, సంగీత మహోత్సవాన్ని జయప్రదం చేయాలని యోగి నారాయణ సేవా సమితి సభ్యులు కోరారు. గురువారం స్థానిక కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా హిందూపురం సేవాసమితి అధ్యక్షుడు రవిశంకర్ మాట్లాడుతూ హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా 8 నుంచి నుంచి పదిరోజులపాటు ప్రతి గ్రామంలో యోగి నారాయణ తాతయ్య గారి గురుపూజ, భక్తి సంగీత మహోత్సవ పోస్టర్లు, కరపత్రాలను పంపిణీ చేస్తామన్నారు. గురుపూజ సంగీత మహోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి సభ్యులు,భక్తులు రాజ్యలక్ష్మి మోహన్, పార్థసారథి, ఆకుల ఉమేష్, రామంజి, నవీన్ కుమార్, శేషాద్రి గౌడ్, అరుణ్ కుమార్, చంద్రశేఖర్, ఇక్బాల్, మంజు, నాగరాజు, వెంకటేష్, హనుమంతప్ప, జగదీష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

రొళ్ల: సున్నా నుంచి ఐదేళ్లలోపు వయస్సున్న చిన్నారులు డయేరియా బారిన పడకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్ఎన్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం హులికుంట ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ రోజూ చిన్నారులు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. సురక్షిత ఆహారం, నీటిని సేవించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

8న చంద్రమౌళేశ్వరస్వామికి కుంభాభిషేకం

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామికి ఈనెల 8న కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. వర్షం కోసం కార్యక్రమం తలపెట్టినట్లు పేర్కొన్నారు. కుంభాభిషేకంతో పాటు రుద్రహోమం, వరుణ జపం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని ,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూదరుల అరెస్ట్

పావగడ: తాలూకాలోని అరసికెరె గ్రామం బయలు ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మందిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జూదరుల నుంచి రూ.50,100 నగదు, 5 బైకులు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రామచంద్రప్ప తెలియజేశారు. దాడుల్లో సీఐ గిరీశ్, అరసికెరె ఎస్ఐ తారాసింగ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు



పెనుకొండలో సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్



చిలమత్తూరులో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: అల్లూరి సీతారామరాజు దేశం మరువలేని గొప్ప పోరాట యోధుడని సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర పోరాటంలో దేశం ఆయన త్యాగాన్ని మరువరాదని కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అల్లూరు సీతారామరాజు బ్రిటిష్ పాలకులను గడగడలాడించారని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప చరిత్ర అధ్యాపకుడు ప్రతాప్ పేర్కొన్నారు. కళాశాలలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. అలాగే ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ శాంతలక్ష్మి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షుడు శివరామకృష్ణ మిట్టాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేసులు, కంబాలప్ప, ఈశ్వర్, రవికుమార్, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయాధికారి మల్లికార్జున అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి భారత స్వాతంత్ర్య పోరాటంలో మహోజ్వల శక్తి అని కొనియాడారు. ఆంగ్లేయులకు ముచ్చెమటలు పట్టించిన గొప్ప శక్తి సీతారామరాజు అని అన్నారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

పరిగి: అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శమని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్‌బాబు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా స్థానిక పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ సమయంలో బ్రిటీష్ పాలకులను సాయుధ పోరాటాలతో ఎదిరించిన మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. మన్యం వీరుడి పోరాట పటిమ చరిత్ర ఉన్నంతవరకూ మరిచిపోరన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగ

హిందూపురం: తనదైన సేవలతో వంగవీటి మోహనరంగ ప్రజానాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని వక్తలు తెలిపారు. హిందూపురంలో గురువారం వంగవీటి మోహనరంగ 77వ జయంతి సందర్భంగా బలిజ సంఘం నాయకుల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. స్థానిక కేవీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు వెంకటరాముడు, రాజ్యలక్ష్మీ మోహన్, కైవారం ట్రస్టు సభ్యుడు రవిశంకర్, జగదీష్, ఆకుల ఉమేష్, పార్థసారథి, నాగరాజు, ఆది, నాగభూషణం, చంద్ర, మంజు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



వంగవీటి మోహనరంగ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

స్ఫూర్తి ప్రదాత సూలగిత్తి నరసమ్మ

పావగడ: కాన్పుల తల్లి దివంగత పద్మశ్రీ డా సూలగిత్తి నరసమ్మ నేటి యువతకు స్ఫూర్తి దాయకమని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ప్రసన్న కుమార్ తెలిపారు. పట్టణం లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సూలగిత్తి నరసమ్మ విచార సంకీర్ణ, వక్తృత్వ పోటీల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూలగిత్తి నరసమ్మ తాలూకాలోని టీఎన్ పేటె అనే కుగ్రామంలో జన్మించి ప్రతిష్ఠాత్మక పద్మశ్రీ అవార్డు పొంది అమ్మతనం లోని విలువలను తెలిపిందన్నారు. కన్నడ అధ్యాపకుడు రామాంజిని మాట్లాడుతూ స్వాతంత్ర్య పూర్వ కాలంలో ఎలాంటి వైద్య సౌలభ్యాలు లేని సందర్భంలో సూలగిత్తి నరసమ్మ తన మెట్టినిల్లు కృష్ణాపురంలో ప్రతి పల్లెకు తిరిగి వందలాది మంది గర్భిణులకు పురుడు పోసిందన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలు రూపశ్రీ, అబూబకర్ సిద్దిక్, అనిల్ కుమార్, వైష్ణవి, దర్మ రక్షి లకు బహుమతులు అందించారు. సూలగిత్తినరసమ్మ 12వ కుమారుడు లాయర్ శ్రీరామ్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలను సన్మానిస్తున్న దృశ్యం

ఆయుర్వేద వైద్య శిబిరం



శిబిరానికి హాజరైన రోగులు

లేపాక్షి: మండల కేంద్రంలోని ఆశ్రయ సేవా ట్రస్ట్‌లో డాక్టర్ అశ్వినికుమార్ గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 50 మందికి వివిధ రోగాలకు సంబంధించిన మందులు, నొప్పులకు మసాజ్ ఆయిల్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న ఆయుర్వేద, యోగా కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆశ్రయ సేవా ట్రస్ట్ స్థాపకులు నళినాక్షి శివకుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



కంటి చుక్కలు వేస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక రోటరీ రంగ మందిరంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి చుక్కల ఆయుర్వేద వైద్య శిబిరానికి జనం పోటెత్తారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యుడు భద్రావతి మోక్షానంద సిద్ధ కంటి చుక్కలను కంటి బాధితుల కళ్లకు వేశారు. ఆ వెంటనే వేపాకును తలపై విసిరారు. ఈ సందర్భంగా మోక్షానంద మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన వంశ పార్యంపర సిద్ధ వైద్యుడు కే ముత్తు కృష్ణన్ తయారు చేసిన సిద్ధ కంటి చుక్కల ఔషధం సాధారణ కంటి జబ్బులు తొలగిస్తుందన్నారు. ప్రతి నెలా 4 వ తేదీన స్థానిక రోటరి క్లబ్ ఆవరణలో కంటి చుక్కల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని రోటరీ అధ్యక్షుడు సత్య లోకేశ్ తెలిపారు. శిబిరంలో నిర్వాహకులు ఆప్ నాయకుడు రామాంజినప్ప, గోవిందప్ప, జీవీల్ రమేశ్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేసిన దృశ్యం

పావగడ: తాలూకా లోని కరియమ్మనపాళ్య గ్రామానికి చెందిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకుడు లోకేశ్ పాళేగార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కి ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజలు తమ వంతు కృషి చేయాలన్నారు. విద్యాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ తన పుట్టిన రోజును వృథా ఖర్చులతో నిర్వహించకుండా విద్యార్థులకు విద్యా సామగ్రి అందించిన లోకేశ్ పాళేగార్ ను అభినందించారు. వాల్మీకి సంఘం నాయకులు ఈరణ్ణ, లింగప్ప, అంబిక రమేశ్, ఓంకారనాయక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా భాస్కర్



భాస్కర్‌ను అభినందిస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా భాస్కర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 30న ఎంపీడీఓ మునిస్వామి పదవీ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీగా ఉండేది. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు ఇదే కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓను ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్కలు అభినందించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆయనకు సూచించారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఇన్‌చార్జ్ ఎంపీడీఓను శాలువా పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో తాగునీరు, పారిశుధ్యం, తదితర వాటి పై దృష్టి సారించాలని సూచించారు.

సూర్యవతి వర్ధంతి



మాట్లాడుతున్న దిల్షాద్

పెనుకొండ: స్థానిక ఎస్టీ హాస్టల్ ప్రాంగణంలో గురువారం ఐద్వా నేత గౌతమి అధ్యక్షతన కామ్రేడ్ మానికొండ సూర్యవతి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు సూర్యవతి లింగవివక్ష, వ్యక్తిగత మరుగుదొడ్లు, కూలీ రేట్ల పెంపు, సమానత్వం, మద్యపాన నిషేధం కోసం పోరాడారన్నారు. మూడు సార్లు సర్పంచ్‌గా, ఎమ్మెల్సీగా, ఎంపీపీగా పని చేసి అనేక సమస్యలను పరిష్కరించారన్నారు. ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షురాలు దిల్షాద్, నేతలు పాల్గొన్నారు.